దివ్యాంగులకు చేయూతనిస్తాం



స్పర్శ్ ఫౌండేషన్‌కు వాహనాన్ని అందజేసిన బాపయ్యచౌదరి, నాగేశ్వర్‌రావు, చంద్రముఖి, రవి తాండ్ర

నూతి బాపయ్యచౌదరి

చిక్కడపల్లి: తెలుగు రాష్ట్రాల్లోని దివ్యాంగులకు సహాయ సహకారాలు అందించేందుకు ఉత్తర అమెరికా తెలుగు సంఘం(నాట్స్) ముందుందని సంఘం అధ్యక్షుడు నూతి బాపయ్యచౌదరి అన్నారు. సోమవారం నాట్స్ స్పర్శ్ సంస్థల ఆధ్వర్యంలో నాట్స్ ఆటిజం ఆన్ వీల్స్ పేరుతో నిర్వహించే కార్యక్రమాన్ని సోమవారం త్యాగరాయ గానసభలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాలలో మానసిక వికలాంగులకు వైద్యం, ఫిజియోథెరపీ సేవలు అందించే అధునాతన వాహనాన్ని ఫౌండేషన్‌కు అందజేశారు. అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ సమాజంలో సమాన అవకాశం కోసం పోరాడి ఎన్నో హక్కులను సాధించుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్పర్శ్ ఫౌండేషన్ సీఈఓ చంద్రముఖి, నాట్స్ సమన్వయకర్త రవి తాండ్ర, సాంబశివరావు, సురేష్‌గౌడ్, ఆర్‌వీజీసీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ కరాటే పోటీలో నగర విద్యార్థుల సత్తా



స్వర్ణ, రజత పతకాలు సాధించిన నగర విద్యార్థులు

కాచిగూడ: మలేషియాలో జరిగిన ఇంటర్నేషనల్ గోజు –రైయు –ఐపో సిటీ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలలో నగరానికి చెందిన జపాన్ షోటోకాన్ అసోసియేషన్ సికో–కరాటే–డోలో శిక్షణ పొందుతున్న ముగ్గురు కరాటే విద్యార్థులు సత్తా చాటారు. కట్టాస్ విభాగంలో ఎస్.జై కార్తికేయన్, ఎస్.తమన్, ఏఎస్ఎన్ గౌతమ్ రజత పతకాలు సాధించారు. సీనియర్ కట్టాస్ విభాగంలో మాస్టర్ వైఆర్ శివకుమార్ స్వర్ణ పతకం సాధించారు. కుమితే విభాగంలో ఎస్.జై కార్తికేయన్, రజత పతకం, ఎస్.తమన్, ఏఎస్ఎన్ గౌతమ్ కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను జపాన్ షోటోకాన్ అసోసియేషన్ సికో–కరాటే –డో ఇండియా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్, 6వ బ్లాక్ బెల్ట్ వైఆర్ శివకుమార్ అభినందించారు.

రిజర్వేషన్లు పెంచి స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

దుండ్ర కుమారస్వామి

కాచిగూడ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కాచిగూడలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీల డిమాండ్లను విస్మరించి స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహిస్తామంటే బీసీలకు అన్యాయం చేసినట్లే అవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణలో వెంటనే బీసీ జనగణన చేపట్టి బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న దుండ్ర కుమారస్వామి

రాష్ట్రంలో 54 శాతం మేర బీసీ జనాభా ఉందన్నారు. సమావేశంలో గాంధీ నారాయణ, జ్వాల సత్యనారాయణ, మహేందర్, వెంకరమణ, రాజేష సాయి తదితరులు పాల్గొన్నారు.

ఫీవర్ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ



ఫీవర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.శంకర్‌తో కలిసి రోగులకు పండ్లు పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు

నల్లకుంట/కాచిగూడ: ఖైరతాబాద్ డీసీసీ ప్రెసిడెంట్ డాక్టర్ సి.రోహిన్‌రెడ్డి జన్మదిన సందర్భంగా సోమవారం కాంగ్రెస్ నాయకులు స్థానిక ఫీవర్ ఆసుపత్రిలో రోగులకు, కాచిగూడ రైల్వేస్టేషన్ ఫుట్‌పాత్‌లపై ఉన్న పేదలకు బ్రెడ్, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ, అన్నదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకర్, ఆర్ఎంఓ డాక్టర్ జయలక్ష్మి, డాక్టర్ చంద్రశేఖర్, టీపీసీసీ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ కట్టెల సుభాష్, టీపీసీసీ కార్యదర్శి అజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ మామిండ్ల రాజ్‌కిరణ్, ఏపీ పీసీసీ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు శ్యామ్‌రావు, నగర కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ఎం.మహేష్ యాదవ్, సీనియర్ నాయకులు ఎస్.హరినాథ్ రెడ్డి, కె.గోవర్ధన్ రెడ్డి, చింతల ధనార్జున్‌రెడ్డి, సీహెచ్ మురళీకృష్ణ, రామ్మోహన్, ఎడ్ల నరేందర్‌రెడ్డి, ఎస్.గిరి, మధు, మహేష్ గౌడ్, హరినాథ్, రాజశేఖర్ రెడ్డి, ప్రభుదాసు, దేవిరెడ్డి విజితారెడ్డి, సందీప్‌గౌడ్, సత్యవీర్ పాండు తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట: రోహిన్‌రెడ్డి జన్మదిన వేడుకలు, కార్యకర్తలు, నాయకుల మధ్య సందడిగా జరిగింది. సోమవారం ఆయన నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కలిసి పుష్పగుచ్ఛాలు అందించి జన్మదిన శుభకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో కాంగ్రెస్ మహిళ విభాగం ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షులు శంభుల ఉషాశ్రీకాంత్‌గౌడ్, నాయకులు శ్రీకాంత్‌గౌడ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



రోహిన్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మహేష్ యాదవ్



రోహిన్‌రెడ్డికి జన్మదిన శుభకాంక్షలు తెలుపుతున్న శంభుల ఉషాశ్రీకాంత్‌గౌడ్

'గాంధీ'లో అనాథ శవాలతోనే దుర్వాసన

- పోలీస్ మార్చురీ ఏర్పాటే పరిష్కారం
- సూపరింటెండెంట్ రాజారావు

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీ మార్చురీలో గుర్తుతెలియని అనాథ శవాలతోనే దుర్వాసన ఉత్పన్నమవుతోందని నగర శివారులో పోలీస్ మార్చురీ ఏర్పాటుతోనే సమస్య పరిష్కారం అవుతుందని గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు స్పష్టం చేశారు. గాంధీ మార్చురీ నుంచి వెలువడుతున్న దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని అభినవనగర్ కాలనీవాసులు ఇటీవల ఆవేదన వ్యక్తం చేసిన నేపథ్యంలో మాజీ మంత్రి, బీజేపీ నాయకుడు మర్రి శశిధర్‌రెడ్డి స్పందించారు. బీజేపీ శ్రేణులతో కలిసి సోమవారం గాంధీ మార్చురీని పరిశీలించిన అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావుతో భేటీ అయి పలు అంశాలపై చర్చించారు. గుర్తు తెలియని, అనాథ శవాలను చట్టపరంగా 72 గంటల పాటు మార్చురీలో ఉంచాలని, అప్పటికే సదరు మృతదేహాలు కుళ్లిపోవడంతో దుర్వాసన వస్తోందని ప్రతిరోజు నాలుగు నుంచి ఐదు అనాథ మృతదేహాలు మార్చురీకి వస్తుంటాయని రాజారావు వివరించారు. నగర శివారులో పోలీస్ మార్చురీ ఏర్పాటు చేసి, గుర్తుతెలియని, అనాథ శవాలను అక్కడకు తరలిస్తే గాంధీ మార్చురీ వద్ద దుర్వాసన సమస్య పరిష్కారం అవుతుందన్నారు.



గాంధీ సూపరింటెండెంట్ రాజారావుతో భేటీ అయిన మర్రి శశిధర్‌రెడ్డి

ముఖ్యమంత్రికి లేఖ రాస్తా..

పోలీస్ మార్చురీ ఏర్పాటు కోసం తన వంతు కృషి చేస్తానని, సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాస్తానని మర్రి శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన తప్పదన్నారు. చంద్రపాల్‌రెడ్డి, హరినాథ్‌నాయి, శివలింగం, గుంటి సత్యనారాయణ, ఈశ్వర్‌బాబు, రాజీవ్‌దేశ్‌పాండే పాల్గొన్నారు.





రోడ్డును విస్తరించిన ప్రాంతంలో కొనసాగుతున్న వ్యాపార సముదాయాలు

విస్తరణకు నోచుకోని రహదారి!

- లాలాపేటలో నిత్యం ట్రాఫిక్ జామ్
- పనులు చేపట్టాలంటున్న ప్రజలు
- విస్మరిస్తున్న అధికారులు

లాలాపేట: దాదాపు 8 ఏళ్ల నుంచి లాలాపేట ప్రధాన రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. లాలాపేట అంబేడ్కర్ విగ్రహం నుంచి మౌలాలీ ఫ్లై ఓవర్ పూలే విగ్రహం వరకు దాదాపుగా 1.2 కిలో మీటర్ల దూరం 100 అడుగుల వెడల్పు రహదారి విస్తరణ పనులు చేపట్టి సుమారు ఐదేళ్లు అవుతోంది. ఆది నుంచి విస్తరణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. రోడ్డుకి ఇరువైపులా 152 ప్రాపర్టీస్ తొలగించాల్సి ఉండగా ఇప్పటి వరకు జీహెచ్ఎంసీ అధికారులు దాదాపు వందకు పైగా నిర్మాణాలను తొలగించారు. ఇంకా కొన్ని తొలగించాల్సి ఉంది. ప్రజా ప్రతినిధులు, అధికారుల చిత్తశుద్ధి లేని కారణంగానే ఏళ్లతరబడి రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతూనే ఉన్నాయని లాలాపేట వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు మధ్యలో స్తంభాలు..

లాలాపేట రోడ్డు విస్తరణ పనుల్లో రోడ్డుకు రెండు వైపులా పలు నిర్మాణాలు తొలగించారు. దీంతో గతంలో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలు నేడు రోడ్డు మధ్యలోకి వచ్చాయి. నిర్మాణాలు తొలగించిన స్థానంలో తిరిగి రోడ్డు నిర్మాణం చేయకపోవడంతో ప్రభుత్వం నుంచి నష్టపరిహారం తీసుకున్న కొందరు వెనక్కి జరిగినట్లే జరిగి మరో రెండడుగులు ముందుకేసి రోడ్డుకు కేటాయించిన స్థలాన్ని ఆక్రమించారు. మరి కొందరు రోడ్డుకు కేటాయించిన స్థలాన్ని చిరు వ్యాపారులకు ఇచ్చి నెల వారి అద్దెలు వసూలు చేస్తున్నారు. దీంతో లాలాపేట రోడ్డు విస్తరణ చేసినా ఫలితం లేకుండా పోయిందని ప్రజలు వాపోతున్నారు.

సగం కూడా కాలేదు..

లాలాపేట ప్రధాన రహదారిలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించకపోగా ఉదయం, సాయంత్రం వేళలలో మరింత జఠిలంగా మారింది. దీనికి తోడుగా ప్రతి మంగళవారం ఏర్పాటు చేసే వారాంతపు సంతతో వాహనదారులకు ఈ మార్గంలో నరకయాతన తప్పడం లేదు. లాలాపేటలోని ప్రభుత్వ ప్రసూతి హాస్పిటల్‌కు చెందిన అంబులెన్స్‌కు సైతం ఈ ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. లాలాపేట ప్రధాన రహదారిని విస్తరించి మోడల్ రోడ్డు నిర్మాణం చేస్తామని గత పదేళ్ల క్రితం ప్రజా ప్రతినిధులు చెప్పిన మాటలు ఇంకా కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికే ఎన్నో ఏళ్లు గడిచిపోయాయి. ఇంకా విస్తరణ పనులు సగమైనా పూర్తి కాలేదు. మోడల్ రోడ్డు నిర్మాణం చేయడానికి ఇంకా ఎంతకాలం అవుతుందోనని లాలాపేట వాసులు ఎదురు చూస్తూనే ఉన్నారు.

నివారణ చర్యలు చేపట్టాలి..



ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తగ్గించాలనే ఉద్దేశ్యంలో ప్రభుత్వ కోట్ల రూపాయలు ప్రజాధనం వెచ్చించి లాలాపేట ప్రధాన రహదారి విస్తరణ చేపట్టింది. విస్తరణలో నెలకొన్న కాలయాపనతో ప్రభుత్వానికి చెడు పేరు వచ్చేలా అధికారులు వ్యవహరించడం తగదు. రోడ్డుకు కేటాయించిన స్థలాన్ని వ్యాపారులు అక్రమించి ట్రాఫిక్ సమస్యను మళ్లీ మొదటికి తీసుకొస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి తాత్కాలిక రోడ్డు నిర్మాణం చేస్తే వాహనాల రాకపోకలకు వీలుంటుంది.

–మల్లికార్జున్, లాలాపేట

అధికారులు స్పందించాలి..



2019 ఎన్నికల ముందు లాలాపేట రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. భారీ ప్రాజెక్టుల నిర్మాణంలో సైతం ఇంత సమయం పట్టదు. కేవలం కిలో మీటరు దూరం రహదారి విస్తరణ పనులు ఏళ్ల తరబడి చేస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ప్రజా సమస్యలపై నిర్లక్ష్య ధోరణి విడనాడి విస్తరణ పనులు పూర్తి చేసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి.

–శ్రీరాం కృష్ణ, లాలాపేట

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్ఎస్‌పీడీసీఎల్ 11కేవీ ఆజామ్‌బాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏడీఈ విజయభాస్కర్ తెలిపారు. వైఎంసీఏ ఫీడర్ పరిధిలో నారాయణగూడ బ్లెడ్‌బ్యాంక్, వైశ్య హాస్టల్, లింగంపల్లి, జైన్ మందిర్, రాఘవేంద్రస్వామి టెంపుల్, నృపతుంగ కాలేజ్ ప్రాంతాల్లో 9 గంటల నుంచి 10.30 వరకు, బసంత్ కాలనీ ఫీడర్ పరిధిలో బసంత్ కాలనీ, కాచిగూడ క్రాస్‌రోడ్ ప్రాంతాల్లో 11 గంటల నుంచి 12.30 వరకు, ఫీవర్ ఆసుపత్రి ఫీడర్ పరిధిలో అంజయ్య క్వార్టర్స్, తెలంగాణ యువతి మండలి, బర్కత్‌పుర పెట్రోల్ బంక్ 2 గంటల నుంచి 3.30 వరకు, నల్లకుంట ఫీడర్ పరిధిలో నల్లకుంట, విజయబ్యాంక్, భారతీ ఇన్‌స్టిట్యూట్, తిలక్‌నగర్, ఫీవర్ ఆసుపత్రి ప్రాంతాల్లో 3.30 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

నేటితో ముగియనున్న ఓయూ వీసీ పదవీ కాలం



ప్రొ.రవీందర్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ వీసీ ప్రొ.రవీందర్ పదవీ కాలం (21న) నేటితో ముగియనుంది. మూడేళ్ల క్రితం వీసీగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఆయన క్యాంపస్‌లోని వైస్ ఛాన్స్‌లర్ నివాసంలో ఉంటూ 21 పాయింట్ ఫార్ములతో నిత్యం వర్సిటీ అభివృద్ధికి పాటు పడ్డారు. కాంట్రాక్టు అధ్యాపకులు, ఉద్యోగుల బదిలీ విషయంతో కొంత వివాదం తలెత్తినా వారి సేవలు మెరుగు పడ్డాయి. సకాలంలో వేతనాలు అందిస్తూ ఉద్యోగుల మన్ననలను పొందారు. పీహెచ్‌డీ విద్యార్థులకు వన్‌టైమ్ ఛాన్స్ ఇచ్చి వందలాది మంది పూర్వ విద్యార్థులకు డాక్టరేట్ డిగ్రీలను అందుకునేలా అవకాశం కల్పించారు. హాస్టల్ సమస్యలు లేకుండా చేసి విద్యార్థినులకు క్యాంపస్‌లో ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించారు.100 ఏళ్ల పైలాన్ నిర్మాణం, కొత్త హాస్టల్స్, ఇతర భవనాలను నిర్మించారు. కొన్ని కఠిన నిర్ణయాలతో వివాదాలు చెలరేగినప్పటికి ఉద్యోగ నియామకాలు మినహా ఓయూ అభివృద్ధికి ఇతర వీసీల కన్నా వినూత్నంగా సేవలందించి వీసీగా ప్రొ.రవిందర్ మంచి పేరు తెచ్చుకున్నారు.

తీన్‌మార్ మల్లన్న విజయానికి కృషి

ఉస్మానియా యూనివర్సిటీ: ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్‌మార్ మల్లన్న గెలుపునకు కృషి చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు వట్టికూటి రామారావుగౌడ్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారం కోసం తనను భువనగిరి పార్లమెంట్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీ కోఆర్డినేటర్‌గా నియమించినట్లు తెలిపారు. తనపై నమ్మకంతో మల్లన్న గెలుపునకు ఎన్నికల ప్రచారం కోసం నియమించిన సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్‌కు కృతజ్ఞతలు అన్నారు.

ఆధ్యాత్మికతకు పట్టాభిషేకం

ఆచార్య కొలకలూరి ఇనాక్

చిక్కడపల్లి: మానసికంగా, భౌతికంగా, సామాజికంగా ఆధ్యాత్మికతను ప్రచారం చేస్తున్న పురాణపండ శ్రీనివాస్ రచనలోని అక్షరాలు ఆధ్యాత్మికతకు పట్టాభిషేకం అని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ కొనియాడారు. సోమవారం సాయంత్రం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయగాన సభలోని గుండవరపు హన్మంతరావు కళావేదికలో పురాణపండ శ్రీనివాస్ రచించిన 'ఉగ్రం–వీరం'గ్రంథాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇనాక్ మాట్లాడుతూ నరసింహస్వామి అవతారంలోని ఉగ్రం రూపం సమాజ శ్రేయస్సు కోసమేనని పురాణపండ శ్రీనివాస్ వ్యాఖ్యానించారని, సంస్కృత శ్లోకాలతోపాటు తెలుగులో విశ్లేషణ చేశారని వివరించారు. ఆధ్యాత్మిక సాహిత్యంలో పురాణపండ బహుగ్రంథ కర్త అని అన్నారు. పురాణపండ జీవితకాలం ఆధ్యాత్మిక సాహితీ సేద్యం చేస్తూ సంపదనను వెచ్చిస్తున్న అరుదైన మహనీయుడని పేర్కొన్నారు. ప్రముఖ సాహితీవేత్త ప్రొఫెసర్ శరత్ జ్యోత్స్నారాణి మాట్లాడుతూ సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు ఈ గ్రంథాలు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో గాన సభ అధ్యక్షుడు వీఎస్ కళాజనార్ధనమూర్తి, అపర్ణ పాల్గొన్నారు.



'ఉగ్రం–వీరం'గ్రంథం ఆవిష్కరిస్తున్న ఇనాక్, శరత్ జ్యోత్స్నారాణి, కళాజనార్ధనమూర్తి, అపర్ణ

లంబాడాలకు మంత్రి పదవి ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న భూక్యా సంజీవనాయక్

భూక్యా సంజీవ్‌నాయక్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కాంగ్రెస్ ప్రభుత్వంలో లంబాడాలకు మంత్రి పదవి ఇవ్వాలని సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవనాయక్ డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సేవాలాల్ సేన సమావేశంలో ఆయన మాట్లాడారు. సేవాలాల్ సేన రాష్ట్ర కమిటీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలో నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. గిరిజనులు రాష్ట్రంలో కొట్లాడి సాధించుకున్న పది శాతం రిజర్వేషన్ కొనసాగించాలని, అందు కోసం పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని తెలిపారు. కావాలనే కొంత మంది స్వార్థపరులు గిరిజనులకు పది శాతం రిజర్వేషన్లు దక్కకుండా హైకోర్టులో పిటిషన్ వేశారన్నారు. సమావేశంలో కోర్ కమిటీ చైర్మన్ ధరావత్ ప్రేమ్‌చంద్, రాష్ట్ర ఇన్‌చార్జి మాలోతు సైదానాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబునాయక్, రైతు సంఘం అధ్యక్షుడు బానోతు కిషన్‌నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ రఘురామ్ రాథోడ్, గ్రేటర్ అధ్యక్షుడు కళ్యాణ్ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ధరావత్ వెంకన్న, లకావత్ భాస్కర్, ఉపాధ్యక్షులు రేఖ్యా నాయక్, పరశురామ్ నాయక్, బాలు నాయక్, మోతీలాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణంపై కదిలిన అధికారులు



బీజేఆర్‌నగర్ బస్తీలోని అక్రమ నిర్మాణం

సాక్షి ఎఫెక్ట్..

బంజారాహిల్స్: వైన్‌షాపు ఏర్పాటును వ్యతిరేకిస్తూ బస్తీవాసుల ఆగ్రహం అనే శీర్షికన సోమవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు స్పందించారు. జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని కొత్త చెరువు పక్కన బీజేఆర్‌నగర్ బస్తీ నాలాను ఆనుకుని కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం షాపు ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించారంటూ స్థానికులు ఆరోపించారు. దీంతో షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డి ఆర్ఐలు, సర్వేయర్లతో కలిసి సోమవారం ఈ ప్రాంతాన్ని తనిఖీ చేశారు. అయితే ఈ స్థలానికి సంబంధించి కలెక్టర్ నుంచి ఎన్‌ఓసీ కూడా ఉందని, ఈ వైన్‌షాపు నిర్వహణకు మాత్రం జీహెచ్ఎంసీ అనుమతి లేకుండా నిర్మించినట్లు ఆమె గుర్తించారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ సర్కిల్–18 టౌన్‌ప్లానింగ్ ఏసీపీకి ఈ అక్రమ నిర్మాణం విషయంలో లేఖ రాస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. రోడ్డు పక్కనే కొన్నాళ్లుగా ఇంత పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే అవినీతి, అక్రమాలు, వసూళ్లు, బెదిరింపులకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన సర్కిల్–18 టౌన్‌ప్లానింగ్ అధికారులకు కనిపించలేదా? అంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమ నిర్మాణంపై జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్‌కు ఫిర్యాదు చేయడానికి బస్తీవాసులు సిద్ధమవుతున్నారు. ఈ అక్రమ నిర్మాణం వెంటనే కూల్చివేయాలంటూ, ఇక్కడి నుంచి వైన్‌షాపు తొలగించాలంటూ బస్తీవాసులు ధర్నా చేసేందుకు సిద్ధమవుతున్నారు.

25న సైకాలజిస్టుల శిక్షణశిబిరం



సమావేశంలో మాట్లాడుతున్న పద్మాకమలాకర్, వీజే క్యార్లిన్

చిక్కడపల్లి: సైకాలజిస్టుల వృత్తి నైపుణ్యాలు పెంపొందించేందుకు సైకియాట్రిస్ట్ డాక్టర్ రవ్వా హరికుమార్‌తో ఒక రోజు జాతీయస్థాయి శిక్షణశిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్, డాక్టర్ వీజే క్యార్లిన్ తెలిపారు.సోమవారం అశోక్‌నగర్‌లో డాక్టర్ హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 25వ తేదీన శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అశోక్‌నగర్‌లో మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ హాల్‌లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైకాలజిస్టులు, సైకాలజీ విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. వివరాలకు 9390044031కు సంప్రదించాలని సూచించారు.

వరద మట్టి తొలగింపు



వరద మట్టిని తొలగింపచేస్తున్న పద్మావెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: వర్షాల కారణంగా జనావాసాల్లో పెద్దఎత్తున బురద, మట్టి పేరుకుపోయింది. దీంతో ఆయా ప్రాంతాల ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు చొరవ తీసుకుంటున్నట్లు బాగ్ అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి తెలిపారు. సోమవారం డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో మట్టిని జీహెచ్ఎంసీ పారిశుధ్య సిబ్బందితో తొలగింపజేశారు. పరిసరాలు పరిశుభ్రంగా చేయించినట్లు చెప్పారు. కార్పొరేటర్ వెంట బీఆర్ఎస్ నాయకులు బి.వెంకట్‌రెడ్డి, గోవిందర్జున్, జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

క్రికెట్ టీమ్ విజేత భవాని టైగర్స్



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న మాశెట్టి శ్రావణి

కాచిగూడ: రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు వివిధ క్రీడా పోటీలు, రాష్ట్ర స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో 21 టీమ్స్ పాల్గొన్నాయి. పోటీల్లో చార్మినార్ భవాని టైగర్స్ టీమ్ విజేతగా నిలిచింది. విజేతలకు తెలంగాణ వీర శైవ లింగాయత్, లింగ బలిజ సంఘం మహిళా అధ్యక్షురాలు మాశెట్టి శ్రావణి ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో లింగబలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పటోళ్ల సంగమేశ్వర్, గౌరవ అధ్యక్షుడు వెన్నె ఈశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల బకాయిలు విడుదల చేయాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కర్రోల్ల రవిబాబు

కాచిగూడ: కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు రావాల్సిన అన్ని రకాల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కార్మిక విభాగం ఇన్‌చార్జి కర్రోల్ల రవిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర కార్మిక సంక్షేమ మండలి కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అంజేశారు. రాష్ట్రవ్యాప్తంగా 6 నెలలుగా ఆగిపోయిన కార్మిక సంక్షేమ బకాయిల క్లెయిమ్స్, బిల్లులు వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్మిక సంక్షేమం, బీమా సౌకర్యాలపై మరింత అవగాహన కల్పించాలన్నారు.జ్యోతి, శ్రవణ్ మహారాజ, వెంకట ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ముషీరాబాద్: ముషీరాబాద్‌లోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 2024–25 సంవత్సరానికిగాను మొదటి విడత ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో జూన్ 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ హనుమానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. మే 16 నుంచి దరఖాస్తుల ప్రక్రియ మొదలైందని పేర్కొన్నారు. ఈ కళాశాలలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్, టర్నర్, మెషినిస్ట్, ఆర్ అండ్ ఏసీ, డీజిల్ మెకానిక్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, రాఫ్ట్‌మెన్ సివిల్, ఫ్యాషన్ డిజైన్ అండ్ టెక్నాలజీ, సోలార్ టెక్నీషియన్ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఇంటి నుంచి పారిపోయి వచ్చిన బాలుడు

- హోమ్‌కు తరలించిన పోలీసులు

అడ్డగుట్ట: ఇంట్లో నుంచి పారిపోయి వచ్చి రైల్వే స్టేషన్‌లో తచ్చాడుతున్న ఓ బాలుడిని ఆర్పీఎఫ్ పోలీసులు చేరదీసి కాచిగూడలోని హోమ్‌కు తరలించారు. సికింద్రాబాద్ స్టేషన్‌ని ప్లాట్‌ఫామ్–01లో ఈ నెల 19న గౌతమ్ (08)అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. ఇది గమనించిన ఆర్పీఎఫ్ పోలీసులు సదరు బాలుడి వద్దకు వెళ్లి విచారించగా, ఇంటి నుంచి పారిపోయి వచ్చినట్లు చెప్పడంతో కాచిగూడలోని హోమ్‌కు తరలించారు.

రైల్లోంచి జారిపడి బాలికకు తీవ్రగాయాలు

కాచిగూడ: ప్రమాదవశాత్తు రైల్లోంచి జారిపడి బాలికకు తీవ్ర గాయాలయ్యాయి. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... బోగ్గులఅడ్డా ప్రాంతానికి చెందిన రమేష్ కుమార్తె గువ్వ విజయ(14) కుటుంబసభ్యులతో కలిసి సోమవారం లింగంపల్లికి వెళ్లడానికి కాచిగూడ రైల్వేస్టేషన్‌కు వచ్చింది. కుటుంబ సభ్యులందరితోపాటు బాలిక కూడా ఎంఎంటీఎస్ రైలు ఎక్కింది. అయితే తండ్రి రైలు ఎక్కలేదని గమనించి వెంటనే కిందికి దూకడంతో బాలికకు తీవ్ర గాయాలయ్యాయి. రైల్వే పోలీసులు చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.